ముంపులోనే లంకలు



ముమ్మిడివరం కూనాలంకను ముంచెత్తిన వరద నీరు



కె.ఏనుగుపల్లి కాజ్‌వేపై వరద ప్రవాహంలో పాడి రైతు



ఆలమూరు మండలం బడుగువాని లంకలో వరద నీటిలో బొప్పాయి తోటలు

ముమ్మిడివరం, జూలై 28: గోదావరి వరద ఉధృతి పెరగడంతో లంక గ్రామాలను ముంచెత్తుతోంది. లోతట్టు ప్రాంతాలన్నీ నీటిలో మునుగుతున్నాయి. వివేకానంద వారధి-గురజాపులంక సిమెంటు రోడ్డు గురజాపులంక వరకు నీట మునిగింది. ఆ రోడ్డుపై నాలుగు అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తోంది. లంకాఫ్ ఠాణేలంకలోని మత్స్యకార కాలనీ వరద నీటిలో మునిగింది. లంకాఫ్ ఠాణేలంక, లంకాఫ్ గేదెల్లంక, కూనాలంక, గురజాపులంక, చింతపల్లిలంక, సలాదివారి పాలెం వరద నీటిలో మునిగాయి. లంక గ్రామాల్లో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. రోడ్లు వరద నీటిలో మునగడంతో పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ఆధ్వర్యంలో బాధితులకు రక్షిత మంచినీరు సరఫరా చేస్తున్నారు. బియ్యం, నిత్యావసరాలను ఇప్పటికే పంపిణీ చేశారు. వరద సహాయక ప్రత్యేకాధికారి ఎస్.మధుసూదన్, తహసీల్దారు బి.శ్రీనునాయక్, వీఆర్వో స్థానికంగా ఉండి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ కొనసాగుతోంది.



కూనాలంక గుత్తాలవారిపేట సమీపంలో కోతకు గురవుతున్న ఇల్లు

జల దిగ్బంధంలో బడుగువానిలంక

ఆలమూరు, జూలై 28: గోదావరి వరద నీరు క్రమక్రమంగా పెరుగుతుండడంతో మండలంలోని బడుగువానిలంక జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఆదివారం మధ్యాహ్నం నుంచి వరద ఉధృతితో ఆ గ్రామ ప్రధాన రహదారిపైకి నీరు చేరింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అయితే ఎగువ ప్రాంతంలో వరద ఉధృతి తగ్గుముఖం పట్టడంతో కొద్దిగా పెరిగినా ప్రమాదం ఉండదనే సమాచారంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకుంటున్నారు. ముందుజాగ్రత్త చర్యగా తహసీల్దారు అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో పునరావాస కేంద్రాలను సిద్ధం చేశారు. వరద మరింత పెరిగితే గ్రామంలోని 1,114 కుటుంబాలకు చెందిన 3,600 మందిని తరలించేందుకు ఆరు పడవలను సిద్ధం చేశారు. చెముడులంకలోని కల్యాణ మండపంలో వారిని ఉంచనున్నారు. అక్కడ బియ్యం, మంచినీళ్లు, నిత్యావసర సరుకులు సిద్ధం చేశారు. గోదావరి వరద ఉధృతి పెరుగుతుండడంతో బడుగువానిలంక, మడికి, చొప్పెల్ల, చెముడులంక, మూలస్థానం, జొన్నాడ, ఆలమూరు లంక భూముల్లోని వేలాది ఎకరాల్లో వాణిజ్య పంటలు నీట మునిగాయి. జొన్నాడ వద్ద పుష్కర ఘాట్ మునిగిపోగా ఆలయాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. రెండు బ్రిడ్జిల మధ్య గోదావరి పరవళ్లు తొక్కుతోంది.



బడుగువానిలంక ప్రధాన రహదారిపైకి వచ్చిన వరద నీరు

పి.గన్నవరం, జూలై 28: ఎగువన తగ్గుతూ... దిగువన పెరుగుతూ గోదావరి వరద లంక గ్రామస్తులను ఇబ్బంది పెడుతోంది. అయితే ఎగువన వరద ఉధృతి తగ్గడంతో లంక గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ధవళేశ్వరం వద్ద వరద నీటిని భారీగా సముద్రంలోకి వదలడంతో దిగువన గోదావరి నదీపాయలు నిండుగా ప్రవహిస్తున్నాయి. ఇప్పటికే లంక ప్రాంతాలు పూర్తిగా నీటమునగడంతో పాటు పలు ప్రాంతాల్లో గ్రామాల వైపు వరద నీరు చేరింది. గంటి పెదపూడి శివారు మూడు లంక గ్రామాలతో పాటు ఉడిమూడిలంక గ్రామస్తులు బూరుగులంక నదీపాయ వద్ద పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. మానేపల్లి శివారు శివాయిలంక, వాడ్రేవుపల్లి శివారు చినకందాలపాలెం గ్రామస్తులు పడవలపై రాకపోకలు సాగించగా సుమారు 500 మందికి భోజనాలు పెట్టారు. నాగుల్లంక శివారు పల్లిపాలెం, గుడ్డాయిలంక గ్రామాల వైపు వరద నీరు నెమ్మదిగా వచ్చి చేరుతోంది. పశ్చిమ గోదావరి జిల్లా గ్రామాలైన కనకాయలంక, అనగార్లంక, పెదమల్లంక, అయోధ్యలంక గ్రామస్తులు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. మండలవ్యాప్తంగా ప్రభుత్వం తొమ్మిది బోట్లు ఏర్పాటు చేసింది. లంక గ్రామాల్లో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణతో పాటు ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ, తహసీల్దారు ఎస్కే హుస్సేన్, ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి పర్యటించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు.





పి.గన్నవరం అక్విడెక్టు వద్ద డొక్కా సీతమ్మ విగ్రహం

'సీతమ్మా'.. స్మరామి!



పి గన్నవరం మండలం లంకలగన్నవరంలో డొక్కా సీతమ్మ నివాసం

- అపర అన్నపూర్ణమ్మకు లభించిన గుర్తింపు
- మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరు
- కూటమి ప్రభుత్వం నిర్ణయంపై సర్వత్రా హర్షాతిరేకాలు

పి.గన్నవరం, జూలై 28: అపర అన్నపూర్ణగా ప్రసిద్ధి చెందిన డొక్కా సీతమ్మకు కూటమి ప్రభుత్వం అపూర్వమైన గౌరవాన్ని అందించింది. పాఠశాలల్లో అమలులో ఉన్న 'జగనన్న గోరుముద్ద' పథకాన్ని డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనంగా మార్పుచేశారు. మారుమూల లంక గ్రామంలో బ్రిటీష కాలంలో అడిగిన వారికి లేదనకుండా అన్నం వండి వడ్డించిన సీతమ్మకు సముచిత గౌరవం దక్కడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో 1841 సంవత్సరంలో అనప్పిండి భవానీశంకరం-నరసమ్మ పుణ్య దంపతులకు జన్మించిన సీతమ్మను లంకలగన్నవరం గ్రామానికి చెందిన జోగన్నకు ఇచ్చి 1850లో వివాహం చేశారు. వారికి ఇద్దరు కుమారులు, కుమార్తెలు జన్మించారు. పెళ్లైన ఏడాది దాటిన నాటి నుంచే నిత్యం అడిగిన వారికి లేదనకుండా అన్నం పెట్టిన ఘనత సీతమ్మకే దక్కుతుంది. బ్రిటిష హయాంలో అప్పటి కలెక్టర్ సీతమ్మ తయారుచేసిన గరిక వేళ్ల పచ్చడి రుచి చూసి ఆశ్చర్యపడ్డారు. అలా సీతమ్మ అన్నదానం దశదిశలా వ్యాపించింది. ఈమె ఖ్యాతి గురించి తెలుసుకున్న ఏడవ ఎడ్వర్డ్ తన పట్టాభిషేకం సమయంలో ఆమె ఫొటోను తీయించి వెంటనే పంపించాలని అప్పటి కలెక్టర్‌కు లెటర్ రాశారు. దానిని సీతమ్మకు అందించి ఫొటో కావాలని కలెక్టర్ కోరగా మొదట అంగీకరించలేదు. తాను ప్రచారం కోసం ఈ సేవ చేయడం లేదని ఆమె సున్నితంగా అడ్డుచెప్పగా, కలెక్టర్ తాను మీ ఫొటో పట్టాభిషేకానికి పంపకపోతే తన ఉద్యోగానికి ఎసరు అవుతుందని చెప్పడంతో ఆమె అంగీకరించి ఫొటో దిగారు. ఈ ఫొటోను ఒక ప్రత్యేక ఆసనంలో ఉంచి ఎడ్వర్డ్ పట్టాభిషేకం చేసినట్టు చెబుతారు. తర్వాతకాలంలో ఆ ఫొటోను బ్రిటిష ప్రభుత్వం ప్రత్యేకంగా ఉంచి లండన్‌లో ఏర్పాటుచేసిందని చెబుతారు. లండన్ పార్లమెంటులో ఉన్న సీతమ్మ ఫొటోను లోక్‌సభ స్పీకర్ బాలయోగి స్వయంగా చూసి ఆమె తమ కోనసీమకు చెందినవారని అక్కడి వారికి చెప్పగా, తనకు ప్రత్యేక గౌరవం లభించిందని బాలయోగి చెప్పేవారు. ఇక లంకల గన్నవరంలో సీతమ్మ నివాసం, గృహోపకరణాలు, వంటసామగ్రిని ఆమె కుటుంబీకులు భద్రపరిచారు. ఇల్లు శిథిలావస్థకు చేరుకోగా, మరమ్మతులు చేయించి నేటి తరానికి అందుబాటులో ఉంచారు. సీతమ్మ నివాసం పి గన్నవరం మండలం లంకలగన్నవరంలో ప్రధాన రహదారి నుంచి సుమారు కిలోమీటరు దూరంలో ఉంటుంది. సీతమ్మ నివాసం వైపు చూపిస్తూ పర్యాటకశాఖ ఏర్పాటుచేసిన సూచిక శిథిలమైంది. సీతమ్మ నివాసానికి కూతవేటు దూరంలో ఏర్పాటు చేసిన మరో బోర్డు కూడా విరిగిపడంతో ఓ గోడకు నిలబెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే డొక్కా సీతమ్మ క్యాంటీన్లు ఏర్పాటు చేస్తామని ఎన్నికల ప్రచార బహిరంగ సభల్లో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటించారు. నేటి యువతకు ఆదర్శంగా ఉండాలనే లక్ష్యంతో సీతమ్మ పేరును ప్రతిపాదించడాన్ని అప్పుడు అన్ని వర్గాలూ స్వాగతించాయి. చెప్పినట్టుగానే మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరు పెడుతూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై గోదావరి జిల్లాల ప్రజానీకం అంతా సంబరపడుతోంది.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి



మధ్యాహ్న భోజనపథకానికి డొక్కా సీతమ్మ పేరు పెడుతూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షదాయకం. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు. సీతమ్మ నివాసాన్ని అభివృద్ధిచేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని మా కుటుంబం తరఫున ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం. పి.గన్నవరం అక్విడెక్టుకు అప్పట్లో టీడీపీ ప్రభుత్వమే సీతమ్మగా నామకరణం చేసి ప్రత్యేక గౌరవం ఇచ్చింది. మళ్లీ ఈ నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉంది.

- డొక్కా భీమవెంకట కామేశ్వరరావు, సీతమ్మ ఐదో తరం వారసుడు



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ, కూటమి నాయకులు

విజయకృష్ణ కుటుంబానికి అండగా ఉంటాం

కలెక్టర్ మహేష్‌కుమార్

పి.గన్నవరం, జూలై 28: గోదావరి వరద సహాయక చర్యల్లో భాగంగా మండలంలోని ఉడిమూడిలంకలో జరిగిన పడవ ప్రమాదంలో చదలవాడ విజయకృష్ణ గల్లంతయ్యాడని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన సంఘటనా స్థలానికి చేరుకుని అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణతో ఘటనపై చర్చించారు. వరద ముంపులో వున్న కుటుంబాలకు బియ్యం, నిత్యావసర వస్తువులు అందించాలని టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ చైర్మన్ నామన రాంబాబు కలెక్టర్‌ను కోరారు. కాగా పడవ ప్రమాద ఘటనపై సీఎం చంద్రబాబు వెంటనే స్పందించారు. గల్లంతైన విజయకృష్ణ కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. సోమవారం చెక్కు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, అన్ని విధాలుగా ఆదుకుంటామని కలెక్టర్ భరోసా కల్పించారు. ఆయన వెంట జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు వున్నారు. విజయకృష్ణ తల్లిదండ్రులను జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు పరామర్శించారు. ప్రభుత్వపరంగా అన్ని విధాలా ఆదుకునేలా సహకరిస్తానని చెప్పారు.

ఉడిమూడిలంకలో పడవ బోల్తా

- లంక గ్రామాల్లోకి వాటర్ ప్యాకెట్లు తీసుకువెళ్తున్న పడవ
- అందులో ప్రయాణిస్తున్న ఆరుగురిలో ఒకరు గల్లంతు
- సురక్షితంగా బయటపడ్డ ఐదుగురు వ్యక్తులు

..., వివరాలు 7లో



కోటిపల్లిలో వరద ముంపు బాధితులతో మాట్లాడుతున్న మంత్రులు అచ్చెన్నాయుడు, అనిత, సుభాష్

వరద బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటాం

వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

కె.గంగవరం, జూలై 28: గోదావరి వరదలకు ముంపు బారిన పడిన కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటామని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్థక, మత్స్య శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఆదివారం ఆయన హోం మంత్రి వంగలపూడి అనిత, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌లతో కలిసి కోటిపల్లిలో వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. బాధిత కుటుంబాల వారిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. వరద ఉధృతి, ముంపు బారిన పడిన వివరాలను మంత్రులకు కలెక్టర్ మహేష్‌కుమార్ వివరించారు. కోటిపల్లి రైతు సేవా కేంద్రంలో ఏర్పాటుచేసిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని మంత్రులు సందర్శించారు. రైతులకు పశువులకు సంబంధించిన లివర్ టానిక్‌లు, గడ్డి విత్తనాలు, మినరల్ మిక్చర్ పంపిణీ చేశారు. వరద ప్రభావిత 14 మండలాల్లోని 51 ఆవాసాల్లో పశువుల ఆరోగ్య భద్రతకై 175 పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సేవలు అందించినట్లు పశుసంవర్థక శాఖ జిల్లా శాఖ అధికారి వెంకట్రావు వివరించారు. కోటిపల్లి మత్స్యకార కాలనీలో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సుభాష్ అధికారులను ఆదేశించారు.

బలహీన ఏటిగట్ల శాశ్వత పరిరక్షణకు చర్యలు: హోం మంత్రి అనిత



సుందరపల్లి వద్ద బలహీనంగా ఉన్న ఏటిగట్టును హోం మంత్రి అనిత పరిశీలించారు. అక్కడ జరుగుతున్న తాత్కాలిక పరిరక్షణ చర్యలను గమనించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఇక్కడ వరదలు వస్తూనే ఉన్నాయి. ప్రజలు బిక్కుబిక్కుమంటూనే జీవిస్తున్నారు. అయినా గత పాలకులు ఏ విధమైన చర్యలూ తీసుకోలేదని అర్థమైందన్నారు. బలహీనంగా ఉన్న ఏటిగట్లను శాశ్వత ప్రాతిపదికన పటిష్టపరచడానికి ప్రణాళికలు తయారుచేసి మంత్రుల బృందం ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు నివేదించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. పర్యటనలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, రామచంద్రపురం ఆర్డీవో సుధాసాగర్, సర్పంచ్ పెమ్మాడి బేబీసత్తిబాబు, కూటమి నాయకులు వెంటూరు వీర్రాఘవులు చౌదరి, గొడవర్తి రామకృష్ణ, కర్రి చిట్టిబాబు, పప్పుల సాయిబాబు, తాడాల జానకిరామ్, రవ్వా భూషణం, మేడిశెట్టి రవికుమార్, సలాది రమేష్, శీరెడ్డి సత్తిబాబు, దేవరపల్లి చక్రి తదితరులు పాల్గొన్నారు.

కూలిన బతుకులు



అన్నదమ్ముల మృతదేహాలు

గండేపల్లి శివారు మురారి వద్ద ఘోర ప్రమాదం

బైక్‌పై నుంచి అదుపుతప్పి పడిపోయిన తల్లి, ముగ్గురు కుమారులు

వారిపై నుంచి దూసుకుపోయిన గుర్తు తెలియని వాహనం

ముగ్గురు కుమారులు అక్కడికక్కడే మృతి

తల్లికి తీవ్రగాయాలు..ఆస్పత్రికి తరలింపు

7లో

నేడు గ్రీవెన్స్ రద్దు

అమలాపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అధికారులంతా వరద సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్నందున సోమవారం కలెక్టరేట్ వద్ద గ్రీవెన్స్ కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక స్థాయికి వరద నీరు చేరి దిగువ ప్రాంతాలకు విడుదల చేస్తున్నారన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో జిల్లా, మండల స్థాయి అధికారులు, ఇతర ప్రభుత్వ సిబ్బంది అందరూ సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్నారు. దాంతో సోమవారం జరగాల్సిన జిల్లా, డివిజన్, మండల స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం రద్దు చేసినందున జిల్లా ప్రజలు గమనించాలని కోరారు.

ఆకతాయిల దాడిలో ఒకరి మృతి

- మరో ముగ్గురికి గాయాలు
- ముమ్మిడివరం నగరం పంచాయతీ సోమిదేవరపాలెం చిన ఉందుర్తిపేట నుంచి తలుపులమ్మ లోవ వెళ్తున్న వారిపై తూరంగి వద్ద అల్లరిమూకల దాడి... 7లో

'కూలి'న బతుకులు

- కూలీ కోసం వెళుతూ కానరాని లోకాలకు..
- మురారిలో ఘోర రోడ్డు ప్రమాదం
- తల్లి పరిస్థితి విషమం.. ముగ్గురు కుమారులు మృతి
- బైక్ అదుపు తప్పి పడిపోవడంతో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిన వైనం
- మృతులు భీమవరం మండలం తాడేరు గ్రామవాసులు

గండేపల్లి, జూలై 28: కూలీ పనులు చేసుకుంటే కానీ పూటగడవని కుటుంబాన్ని మృత్యువు కబళించేసింది. కూలీ పనులకు వెళ్లి తిరిగి సొంతూరుకు వస్తుండగా మృత్యువు గుర్తుతెలియని వాహన రూపంలో వచ్చి ముగ్గురినీ బలితీసుకోగా మరో మహిళ అపస్మారక స్థితికి చేరుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. పశ్చిమగోదావరిజిల్లా భీమవరం మండలం తాడేరు గ్రామానికి చెందిన నంగలం దుర్గ తన కుమారులైన నంగలం రాజు(20), నంగలం యేసు(18), నంగలం అఖిల్(10) సొంతూరులో ఉపాధి లేక నర్సీపట్నం ఏరియా కుంతలం గ్రామానికి ఈనెల 17న ఉపాధి నిమిత్తం పామాయిల్ గెలలు కోయడానికి వెళ్లారు. అక్కడ పది రోజులపాటు పనిచేసుకుని తిరిగి తమ సొంతూరుకు శనివారం సాయంత్రం 6.30కు తల్లితో పాటు ముగ్గురు కుమారులు పల్సర్‌బైక్‌పై బయలుదేరారు. అయితే గండేపల్లి మండలం మురారి గ్రామశివారునకు వచ్చేసరికి ప్రమాదం జరిగింది. అప్పటికే చినుకులు పడడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడగా గుర్తుతెలియని వాహనం వారి మీద నుంచి వెళ్లిపోయినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురు కుమారులు అక్కడికక్కడే మృతి చెందడంతో మహిళ తీవ్ర గాయాలపాలైంది. ఈవిషయం హైవే మొబైల్ సిబ్బంది రాముకు తెలియగానే వెంటనే గండేపల్లి ఎస్ఐ ఎన్.రామకృష్ణ, జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావుకు సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన సీఐ, ఎస్ఐ, పోలీసు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని గాయాలపాలైన దుర్గను 108లో రాజమండ్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడే పడి ఉన్న మృతదేహాలను పరిశీలించి ప్రమాద ఘటనపై సమాచారం సేకరించి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. మృతదేహాలను రాజమండ్రి ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి సీఐ ఎస్.లక్ష్మణరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఈప్రమాద ఘటన చూసిన స్థానికులు ఉలిక్కిపడ్డారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఒకేసారి మృతి చెందడంతో ఆ దారిలో వెళ్లేవారు సైతం చింతించారు. రెక్కాడితేకాని డొక్కాడని ఈకుటుంబం సొంతూరులో ఉపాధి కరువై వేరే ప్రాంతానికి పనికి వెళ్లి తిరిగొస్తుండగా మృత్యుఒడిలోకి చేరిపోవడం అక్కడ అందరినీ కంటతడి పెట్టించింది.



సంఘటనా స్థలంలో మృతిచెందిన నంగలం రాజు, నంగలం ఏసు, నంగలం అఖిల్



ప్రమాదఘటనపై విచారణ చేస్తున్నాం: జగ్గంపేట సీఐ

ఈప్రమాద సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ వేగవంతం చేశాం. పల్సర్ బైక్ వర్షానికి అదుపుతప్పి ప్రమాదం జరిగి ఉండవచ్చు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చే గుర్తుతెలియని వాహనం వీరిని ఢీకొట్టి ఉండవచ్చు. దీనిపై పూర్తిస్థాయిలో నిర్ధారించాల్సి ఉంది. తొందరగా విచారణ చేసి వాహనాన్ని పట్టుకుంటామని, జాతీయరహదారి వెంబడి సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్నామని సీఐ అన్నారు.

తాడేరులో విషాదం



మృతులు నంగలం రాజు, నంగలం ఏసు, నంగలం అఖిల్

భీమవరంరూరల్, జూలై 28: కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మురారి గ్రామశివారులో జరిగిన ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు కుమారులు, వారి తల్లికి గాయాలైన ఘటనతో భీమవరం రూరల్ తాడేరులో విషాదఛాయలు నెలకొన్నాయి. గ్రామానికి చెందిన నంగలం కోటయ్య కుటుంబం కాయకష్టాన్ని నమ్ముకుంది. ఎక్కువగా తాపీ పనులకు వెళ్లి జీవనం సాగిస్తుంటారు. 365 రోజులపాటు ఎక్కడ ఏపని ఉన్నా ఆ కుటుంబం వెళ్లిపోతోంది. అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో పామాయిల్ గెలలు కోసేందుకు వెళ్లి పది రోజుల అనంతరం శనివారంరాత్రి తాడేరు వస్తుండగా ప్రమాదం జరిగింది. ఈసారి కోటయ్య మినహా భార్య దుర్గ, ముగ్గురు కుమారులు నర్సీపట్నం వెళ్లారు. రెప్పపాటులో తనువు చాలించారు. కోటయ్య భార్య దుర్గ గాయాలపాలైంది. ముగ్గురు కుమారులు ప్రాణాలు కోల్పోవడంతో ఆ తండ్రి తల్లడిల్లిపోతున్నారు. చిన్నకుమారుడు అఖిల్ భీమవరంలోని గునుపూడి ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు తమ బిడ్డను పని వద్దకు తీసుకుపోతుంటారు. ఈసారి పాఠశాలకు వెళ్లకుండా అఖిల్ తన తల్లి దుర్గతో నర్సీపట్నం వెళ్లి ప్రమాదంలో దుర్మరణం పొందాడు. తల్లిదండ్రులు కోటయ్య, దుర్గలకు తీరని కడుపుకోత మిగిలింది. పాఠశాలకు వెళ్లి ఉంటే అఖిల్ ప్రాణాలతో మిగిలేవాడంటూ తాతయ్య నంగలం కృష్ణమూర్తి కన్నీటి పర్యంత మవుతున్నారు.

31న ఐసీపీ కోర్సుల్లోని
సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

- మూడు విభాగాల్లో మిగిలిన సీట్ల భర్తీ
- హాజరుకానున్న ఇన్‌ఛార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ

జేఎన్టీయూకే, జూలై 28: ఇంటర్నేషనల్ కొలాబొరేటివ్ ప్రోగ్రాం(ఐసీపీ) కోర్సులలోని సీట్లు, ఎన్ఆర్ఐ సీట్ల భర్తీకి సంబంధించిన రెండో దశ కౌన్సెలింగ్‌ను బుధవారం జేఎన్టీయూకేలోని సెనేట్‌హాల్లో నిర్వహించనున్నట్లు వర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఏఎం ప్రసాద్ తెలిపారు. ఎఫ్‌యూఏఆర్ డైరెక్టర్ శివనాగరాజు, యూసీఈకే ప్రిన్సిపాల్ ఎంహెచ్ఎం కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కౌన్సెలింగ్‌లో ఇన్‌ఛార్జి ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీ కృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారన్నారు. ఈకోర్సుల్లో చేరిన విద్యార్థులు మొదటి మూడేళ్లు కాకినాడ జేఎన్టీయూకేలోనూ, చివరి మూడేళ్లు బీటీహెచ్ స్వీడన్‌లోనూ చదవాల్సి ఉంటుందన్నారు. అయితే 4వ ఏడాది కోర్సును బీటీహెచ్‌లో పూర్తిచేశాకా ప్రోగ్రాంనుంచి వైదొలిగే అవకాశం ఉందని తెలిపారు. సీఎస్ఈ, ఏఐఎంఎల్, ఈసీఈ కోర్సులలో మొత్తం 60సీట్లు ఉండగా ఈనెల 18న నిర్వహించిన మొదటి దశ కౌన్సెలింగ్‌లో సీఎస్ఈలో 5, ఏఐఎంఎల్‌లో 12, ఈసీఈలో 2సీట్లు భర్తీ అయ్యాయన్నారు. మిగిలిన సీట్ల భర్తీకి సంబంధించిన రెండో దశ కౌన్సెలింగ్‌ను ఈనెల 31 నిర్వహిస్తామని తెలిపారు.

సత్యదేవుడి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి పూజలు

అన్నవరం, జూలై 28: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హారి కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి ఆలయ పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందజేయగా పీఆర్వో స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందించారు.



సత్యదేవుడి దర్శనానంతరం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హారి

ఆకతాయిల దాడిలో ఒకరి మృతి

- మరో ముగ్గురికి గాయాలు
- లోవ వెళుతున్న భక్తులపై తూరంగి వద్ద అల్లరిమూక దాడి ఘటన

అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ సోమిదేవరపాలెం నుంచి తలుపులమ్మలోవ వెళుతున్న భక్తుల బృందంపై అల్లరిమూక దాడి చేసిన ఘటనలో ముమ్మిడివరం నగర పంచాయతీ సోమిదేవరపాలెం చిన ఉందుర్తిపేటకు చెందిన ఒక వ్యక్తి మృతి చెందగా మరో ముగ్గురు గాయపడ్డ సంఘటన శనివారం అర్థరాత్రి జరిగింది.



గాలిదేవుడు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, ఇన్‌సెట్‌లో గాలి దేవుడు (ఫైల్)

కాకినాడ క్రైం/ముమ్మిడివరం, జూలై 28 ఆకతాయిల దాడిలో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురు గాయాలపాలైన సంఘటన శనివారం అర్ధరాత్రి కాకినాడలో చోటుచేసుకుంది. ఆదివారంరాత్రి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కాకినాడ ఎస్‌డీపీవో డాక్టర్ హనుమంతురావు వెల్లడిస్తున్న వివరాలిలా ఉన్నాయి. డాక్టర్ అంబేద్కర్ కోనసీమజిల్లా ముమ్మిడివరం మండలం సోమదేవరపాలెం పంచాయతీ సూరయ్య చెరువు గ్రామానికి చెందిన సుమారు 10 మంది కలిసి తలుపులమ్మ అమ్మవారి దర్శనార్థం శనివారం రాత్రి టాటా మ్యాజిక్ వాహనంలో బయలుదేరారు. ఆ వాహనం అర్ధరాత్రి 12 గంటల సమయంలో కాకినాడ, జగన్నాధపురం, మునసబుగారి సెంటరు శివాలయం వద్దకు వచ్చేసరికి ముగ్గురు ఆకతాయిలు బైక్‌పై వచ్చి టాటా మ్యాజిక్ వాహనాన్ని అడ్డగించారు. అందులో బైక్ పైన ఉన్న వ్యక్తి ముందు సెంటర్‌లో మా వాహనాన్ని డీ కొట్టి వచ్చింది మీరే కదా అంటూ వారిపై విరుచుకుపడ్డారు. మాకు తెలియదు అని చెబుతున్నా వినకుండా మీతోపాటు మరో రెండు వాహనాలు ఉంటాయి అని అంటూ ఎవరికో ఫోన్ చేశారు. దాంతో మరి కొద్దిసేపటికి మరో నాలుగు బైక్‌లతో అక్కడికి చేరుకున్నాయి. అనంతరం వారు రాళ్లతో టాటా మ్యాజిక్ వాహన అద్దాలు పగులగొట్టారు. వాహనంలో ఉన్నవారు బయటకు పరుగులు తీయగానే ఆ ఆకతాయిలు పరుగులు పెడుతున్న వారిని రాళ్లతో విచ్చక్షణా రహితంగా కొట్టి పరారయ్యారు. అది గమనించిన స్థానికులు క్షతగాత్రులను ఆటోలో జీజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో చెట్ల గాలిదేవుడు (46) మృతి చెందాడు. క్షతగాత్రుల్లో ఉందుర్తి సాయిరామకృష్ణ, ఉందుర్తి వెంకటకుమారస్వామి, మట్టపర్తి నాగేశ్వరరావు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. బాధితుడు చెట్ల శ్రీరామచరణ్ సూర్యతేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టి ఆదివారం 10 మంది నిందితులను అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో స్థానిక జగన్నాథపురంనకు చెందిన 19ఏళ్ల గన్నె దిలీప్, చేశెట్టి ఆనందకుమార్, పినపోతు దుర్గాప్రసాద్, కొడబాల రాజు, కాలాడి కార్తిక్, 20 ఏళ్ల కర్రి వెంకటదుర్గారావు, 24 ఏళ్ల కామాడి లోకేష్, 23 ఏళ్ల బుట్టల విజయ్, 19 ఏళ్ల బొడ్డు మణికంఠ, 20 ఏళ్ల దారపు వెంకటదుర్గారావు ఉన్నారు. వీరులో ఒకరు మైనర్ కావడంవల్ల అతన్ని జువైనల్ హోం కు తరలించనున్నట్లు ఎస్‌డీపీవో తెలిపారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ వి.సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిసున్న ఎస్‌డీపీవో డాక్టర్ హనుమంతురావు

ఉందుర్తిపేటలో విషాదం

ఆషాడమాసం చివరి ఆదివారం తలుపులమ్మలోవలో అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకుందాం అని ఎంతో సరదాగా బయలుదేరిన భక్తుల బృందానికి అల్లరిమూకల దాడితో విషాదం మిగిల్చింది. శనివారం రాత్రి సోమిదేవరపాలెం చిన ఉందుర్తిపేటకు చెందిన డ్రైవర్‌తోపాటు పదమూడు మంది టాటా మేజిక్ వాహనంలో లోవ బయలుదేరారు. మార్గమధ్యంలో అర్ధరాత్రి 12 గంటల సమయంలో అల్లరిమూక దాడిలో చెట్ల గాలిదేవుడు మృతిచెందగా టాటా మేజిక్ వ్యాను డ్రైవర్‌తోపాటు ముగ్గురు గాయపడ్డారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గాలిదేవుడు ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుని జీవనం సాగిస్తున్నాడు మృతుడి భార్య నూకరత్నం ఆశ కార్యకర్తగా పనిచేస్తుంది. ఇద్దరు కుమారుల్లో పెద్దకుమారుడు నితిన్ పూర్తిగా దివ్యాంగుడు. రెండో కుమారుడు శ్రీరామ్‌కు వివాహమైంది. గాలిదేవుడు, భార్య నూకరత్నం, నితిన్‌లు కలిసి జీవిస్తున్నారు. ఆ కుటుంబానికి మృతుడే ఆధారం. అందరితో ఎంతో కలివిడిగా ఉంటూ అందరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ ఎవరికి ఏ చిన్న ఆపద వచ్చినా వారికి అడ్డుపడుతూ ఉండే గాలిదేవుడు అల్లరిమూక చేతిలో మృత్యువాతకు గురవడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. గాలిదేవుడు మృతితో కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. దైవ దర్శనానికి వెళ్లి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టిస్తోంది.

ఉడిమూడిలంకలో పడవ బోల్తా

- లంక గ్రామాల్లోకి వాటర్ ప్యాకెట్లు తీసుకువెళ్తున్న పడవ
- పడవలో ప్రయాణిస్తున్న ఆరుగురిలో ఒకరు గల్లంతు
- సురక్షితంగా బయటపడ్డ ఐదుగురు వ్యక్తులు



గల్లంతైన చదలవాడ విజయకృష్ణ(ఫైల్)

పి.గన్నవరం, జూలై 28: ఉడిమూడిలంక గ్రామానికి వాటర్ ప్యాకెట్లు తీసుకు వెళ్తున్న పడవ ప్రమాదవశాత్తూ తిరగబడటంతో పడవలో ప్రయాణిస్తున్న ఐదుగురు సురక్షితంగా బయటపడగా ఒకరు గల్లంతయ్యారు. స్థానికులు, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఉడిమూడిలంక గ్రామం లో తాగునీరు నిమిత్తం అధికారులు వాటర్‌ప్యాకెట్లు తీసుకువెళ్లే క్రమంలో పడవను ఏర్పాటు చేశారు. ఉడిమూడి చింతావారిపేట సమీపంలో ఏటిగట్టు దిగువున గోదావరి నదీపాయలో సుమారు 200వాటర్ ప్యాకెట్ల బస్తాలను ఐదుగురు వ్యక్తులు పడవపై ఎగమతి చేసుకుని అవతలి ఒడ్డుకు బయలు దేరారు. పడవ 20 మీటర్లు ప్రయాణించిన తరువాత నీటిలో సుడులు రావడంతో ఐదుగురు వ్యక్తులు బయపడి పడవను నడిపే వ్యక్తి వద్దకు చేరారు. ఈక్రమంలో పడవ తిరగబడి పడవలో ప్రయాణిస్తున్న ఉడిమూడిలంకకు చెందిన మద్దా మురళి(పడవ డ్రైవర్), ఉడిమూడి శివారు పెదపేటకు చెందిన నేలపూడి యోహాన్, నేలపూడి వెంకటేశ్వరరావు, గిడ్డి ఈశ్వర్(పంచాయతీ వర్కర్), గిడ్డి సత్యనారాయణలు సురక్షితంగా ప్రాణాలతో బయటపడగా చదలవాడ విజయకృష్ణ(27) వరద ఉధృతిలో గల్లంతయ్యాడు. అయితే వారిలో సురక్షితంగా బయటపడిన ఐదుగురు లైఫ్‌జాకెట్లుతో ఉన్నారని విజయకృష్ణ లైఫ్‌జాకెట్టు ధరించలేదని చెబుతున్నారు. ఈత వచ్చిన ఈశ్వర్ విజయకృష్ణకు లైఫ్‌జాకెట్టు ఇచ్చినప్పటికీ ప్రయోజనం లేకపోయిందని వరద ఉధృతిలో గల్లంతయ్యాడని చెబుతున్నారు. కాగా పడవ మునిగిన వెంటనే ఏటిగట్టుపై ఉన్న ఉమ్మితి అంబేడ్కర్ బూరుగులంకరేవులో ఉన్న వారికి సమాచారం అందించాడు. వెంటనే స్పందించి హెడ్‌కానిస్టేబుల్ మురళీకృష్ణ, కంఠంశెట్టి రాజు, చిన్నం శ్రీను, చీకరమిల్లి రామచంద్రరావులు రెండు ఇంజన్ పడవలపై బయలుదేరి వెళ్లారు. సంఘటనా స్థలికి సుమారు రెండు కిలోమీటర్లు దూరం వరకు వరద ఉధృతిలో కొట్టుకుపోయి నదీపాయ చెంతనే తుప్పలను పట్టుకుని వేలాడుతున్న ముగ్గురిని ఒక పడవలో సురక్షితంగా తీసుకురాగా మరో ఇద్దరిని బెల్లంపూడి సమీపంలో నాటుపడవతో ఉన్న స్థానికులు రక్షించి ఎదురుగా వస్తున్న రెండవ పడవకు అప్పగించారు. సురక్షితంగా బయటపడిన ఐదుగురును బూరుగులంక రేవు వద్దకు చేర్చారు. సంఘటనా స్థలానికి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణతో పాటు ఆర్డీవో జివివి సత్యనారాయణ, డీఎస్పీ కేవీ రమణ, ఎస్ఐ బి.శివకృష్ణ చేరుకుని సంఘటనా వివరాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే, ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు నాలుగు బోట్లుతో 24 మంది ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది నదిపాయ వద్దకు చేరుకుని సంఘటనా స్థలం వద్ద గాలింపు చర్యలు చేపట్టారు.



ఉడిమూడిలంక పడవ బోల్తా ఘటనలో సురక్షితంగా బయటపడ్డ ఐదుగురు వ్యక్తులు

లైఫ్ జాకెట్లే వారికి లైఫ్‌నిచ్చాయి

నీటిలో ప్రయాణం చేసే సమయంలో లైఫ్ జాకెట్లు ధరించడం ఎంత ముఖ్యమో ఈ సంఘటన రుజువు చేసింది. లైఫ్ జాకెట్లు లేకపోతే ఆ ఐదుగురు కూడా ఆ వరద ఉధృతిలో కొట్టుకుపోయేవారు. లైఫ్‌జాకెట్లు ధరించడంతో వారి ప్రాణాలను వారు రక్షించుకోగలిగారు. బూరుగులంకరేవు వద్ద అధికారులు పదేపదే చెప్తున్నప్పటికీ లంకగ్రామస్తులు కనీసం పట్టించుకోవడంలేదు. అధికారులు పోరు భరించలేక వాటిని కొంతమంది ఒంటిపై వేసుకోవడం మరికొందరూ చేత్తో పట్టుకోవడం వంటి చేష్టలు చేస్తూ ఉంటారు.

కుటుంబ పోషకుడిని కోల్పోయాం: తండ్రి ఆవేదన

రెండు కాళ్లు చచ్చుపడిపోయి ఉన్న కన్న తండ్రికి నిత్యం సేవలు చేస్తు కుటుంబాన్ని మోసే పోషకుడిని కోల్పోయామని చదలవాడ విజయకృష్ణ తల్లిదండ్రులు వెర్రియ్య, పార్వతి రోదిస్తున్నారు. గత ఏడేళ్లుగా మంచంపై ఉన్న తండ్రి వెర్రియ్యకు అన్నీ తానై సేవలు చేస్తున్న ఎదిగొచ్చిన కొడుకు గల్లంతు కావడం ఏమిటని తల్లి పడుతున్న రోదన వర్ణనాతీతం. తండ్రి తరువాత తండ్రిగా రక్షణగా ఉన్న అన్నయ్య గోదావరిలో గల్లంతు కావడంపై చెల్లి కళ్యాణి ఆవేదన చూపరులను సైతం కంటతడి పెట్టించింది. విజయకృష్ణ బి-టెక్ పూర్తిచేసి తండ్రి కోసం బయటకు వెళ్లలేక స్థానికంగా వరి చేల్లో దమ్ములు, పంచాయతీ, రెవెన్యూ అధికారులవద్ద రోజు వారి కూలీకి పనిచేస్తు కుటుంబాన్ని పోషించుకుంటూ ఉంటాడు.

ఆదిశంకర్, వనదుర్గమార్గ్‌ల నిర్మాణ పనులను
పరిశీలించిన నిపుణుల బృందం

అన్నవరం, జూలై 28: వైసీపీ ప్రభుత్వ హయాంలో హడావిడిగా చేపట్టిన ఆదిశంకర్ మార్గ్, వనదుర్గ మార్గ్‌లను ఆదివారం నిపుణుల బృందం పరిశీలించారు. ముందుచూపు లేకుండా రహదారుల కోసం భవనాలను ఆనుకుని కొండను తవ్వడంవలన వాటికి ఏమైనా ప్రభావం ఉంటుందా ఒకవేళ ఉంటే నివారణకు ఏవిధమైన చర్యలు తీసుకోవాలనే ఉద్దేశంతో దేవదాయశాఖ ప్రత్యేక కమిటీ సూచనలతో ఈవో రామచంద్రమోహన్ నిపుణుల బృందంకు లేఖ రాయడంతో కాన్పూర్ ఐఐటీ రిటైర్డ్ ప్రొఫెసర్ మాధవరావు, స్ట్రక్చరల్ ఇంజనీర్ వీర్రాజులు వీటిని పరిశీలించారు. సహజంగా కొండపై రోడ్డుమార్గం ఏర్పాటు చేసే సమయంలో ఒక వర్షాకాల సీజన్ చూసి అప్పుడు బీటీ రోడ్డును వేయాలి. అప్పటి పరిస్థితుల నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణకు పనులు చేపట్టారు. ఆదిశంకర్ మార్గ్‌ను ఆనుకుని సీఆర్వో కార్యాలయం ఒక పక్క, మరోపక్క లోయ ఉండడంతో వీటికి రక్షణ చర్యలపై పరిశీలన చేశారు. వనదుర్గ మార్గ్ ఏర్పాటు వలన ప్రసాదం తయారీభవనం, దాత నిర్మించిన డార్మెటరీ భవనాలకు కలిగుతున్న ఇబ్బందులపై పలు సూచనలు చేశారు. వనదుర్గ మార్గ్ ఏర్పాటువలన భవనాలకు ఎటువంటి ప్రమాదం లేదని మైనర్‌గా కొన్ని పనులు చేపట్టాల్సిఉంటుందని సూచించారు. దేవస్థానం ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు నరసింహారెడ్డి, బాల మురళీలు వీరివెంట ఉన్నారు. మూడురోజుల్లో దీనిపై లిఖితపూర్వక నివేదికను అందజేస్తామని నిపుణుల బృందం పేర్కొన్నారు.



ఆదిశంకర్ మార్గ్‌ను పరిశీలిస్తున్న నిపుణుల బృందం

90వేల ప్యాకెట్ల సత్యదేవుడి ప్రసాదం విక్రయాలు

సత్యదేవుడి చెంత అమృతతుల్యంగా లభించే స్వామివారి గోదుమరవ్వ ప్రసాదం కొనుగోలు కోసం ఆదివారం తలుపులమ్మలోవ నుంచి తిరుగు ప్రయాణంలో తమ స్వస్థలాలకు వెళ్లే భక్తులు అధికసంఖ్యలో విచ్చేశారు. కొండదిగువ తొలిపావంచా జాతీయరహదారిపై ఉన్న రెండు నమూనాలయాల వద్ద ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి విక్రయించారు. కొండపైన, కొండదిగువ, జాతీయరహదారిపై ఉన్న కౌంటర్లలలో సుమారు 90వేల ప్యాకెట్లను విక్రయించినట్లు ప్రసాదం విభాగ అధికారులు పేర్కొన్నారు.

ఎగువన తగ్గుతూ.. దిగువన పెరుగుతూ..

- ధవళేశ్వరం వద్ద 15.80అడుగులకు గోదావరి నీటి మట్టం
- 16,14,844 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల

ధవళేశ్వరం, జూలై 28: పది రోజులుగా పెరుగుతూ తగ్గుతూ ఉధృతంగా ప్రవహించిన గోదావరి ఎగువ నుంచి వస్తున్న వరద నీరు తగ్గుతూ ఉండడంతో ధవళేశ్వరం వద్ద ఆదివారం మధ్యాహ్నం వరకు ఆపై నిలకడగా కొనసాగుతోంది. సోమవారం ఉదయానికి నీటి మట్టంలో తగ్గుదల నమోదుకావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎగువన భద్రాచలం వద్ద 53.90అడుగుల వరకు, ధవళేశ్వరం వద్ద 15.80అడుగుల వరకు అత్యధికంగా నీటిమట్టం పెరిగి 16లక్షల క్యూసెక్కుల వరదనీరు వచ్చింది. ధవళేశ్వరం వద్ద శనివారం అర్ధరాత్రి 14.50అడుగులకు చేరిన నీటి మట్టం ఆదివారం ఉదయానికి 15అడుగులకు పెరిగింది. ఆపై మరింత వేగంగా పెరిగిన నీటి మట్టం మధ్యాహ్నం 3గంటలకు 15.70అడుగులకు చేరుకుని నిలకడగా కొనసాగుతోంది. ఈ సమయంలో కాటన్ బ్యారేజ్ ద్వారా అత్యధికంగా 16,14,844 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తుంది. ఎగువున భద్రాచలం వద్ద 3వ ప్రమాదహెచ్చరికను దాటిన నీటి మట్టం శనివారం రాత్రి 11గంటలకు 53.90అడుగుల వరకు పెరిగింది. ఆపై క్రమంగా తగ్గుముఖం పట్టిన నీటి మట్టం 53అడుగుల దిగువకు చేరడంతో 3వ ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఆపై మరింత వేగంగా తగ్గుతూ ఆదివారం రాత్రి 11గంటల సమయానికి 47.40అడుగులకు చేరుకుంది. రాత్రి 2వ ప్రమాదహెచ్చరికను, సోమవారం నాటికి మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించేదిశగా నీటి మట్టం తగ్గుతూ ఉంది



15అడుగులకు పైగా చేరిన నీటి మట్టాన్ని చూపిస్తున్న సూచీ

- **అప్రమత్తంగా అధికారులు**

ధవళేశ్వరం వద్ద 15.80అడుగుల వరకు నీటి మట్టం పెరగడంతో ఫ్లడ్ సెక్షన్ అధికారులు అప్రమత్తతతో వ్యవహరిస్తూ బలహీన ఏటిగట్లు, అవుట్‌పాల్స్ స్లూయిజ్‌ల వద్ద వరద నియంత్రణ సామగ్రితో అదనపు రక్షణ కల్పిస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో గోదావరి నీటి మట్టం తగ్గడం, ధవళేశ్వరం వద్ద నిలకడగా కొనసాగుతుండడంతో అధికారులు ఊపిరి పీల్చుకుంటున్నారు. అయితే 10 రోజులుగా ఏటిగట్లు వరద నీటిలో నాని ఉండడంతో నీటి మట్టం తగ్గే సమయంలో ఆ ఒరవడికి ఏటిగట్టు కోతకు గురయ్యే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వరదలో జలదీక్ష

- వరద వస్తే రోజుల పాటు నరకయాతనే
- ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పరిహారం ఇచ్చి సురక్షిత ప్రాంతాలకు పంపండి



గోదావరి వరదలో జలదీక్ష చేస్తున్న గ్రామస్తులు

ఎటపాక, జూలై 28: గోదావరికి వరదలు వచ్చే వర్షాకాలం సమయంలో పోలవరం ప్రాజెక్టు ప్రభావంతో ప్రతీఏటా వరదల కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఇక ఈ బాధలు పడలేమని తమకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పరిహారం ఇచ్చి పునరావాసంగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరుతూ ఆదివారం ఎటపాక మండలం గన్నవరం గ్రామంలో గ్రామస్తులు జలదీక్ష నిర్వహించారు. గతంలో వరదలు వస్తే రెండు మూడురోజుల్లో తగ్గుముఖం పట్టేవని, ప్రస్తుతం వరదలు వస్తే వారం, పది రోజులపాటు వరద తగ్గడంలేదని తెలిపారు. ఈసమయంలో బయట ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయని, ఇలాంటి బాధలు తమకు వద్దని తెలిపారు. గన్నవరం, కృష్ణవరం గ్రామాలను ముంపు జాబితాలోని 41.15 కాంటూరులో చేర్చి, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ గ్రామాల్లోని భూములకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. తమ గోడును ఎన్డీఏ కూటమిలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలకించి, తమకు న్యాయంచేయాలని వేడుకున్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ గడ్డం భద్రమ్మ, ఉపసర్పంచ్ కందుకూరి స్వర్ణ, గ్రామపెద్దలు ములిశెట్టి చంద్రశేఖరరావు, కరి నర్సింహారావు, చిన్న శ్రీను, ఎం. సత్యనారాయణ, శ్రీనివాసరావు, పెరమయ్య పాల్గొన్నారు.

మరిడమ్మ జాతరకు
పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో మరిడమ్మ. దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, జూలై 28: కాకినాడ జిల్లా పెద్దాపురంలో మరిడమ్మ జాతరకు నాల్గవ ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బారికేడ్లు, క్యూలైన్లలో భక్తుల సౌకర్యం కోసం పలు ఏర్పాట్లు చేశారు. అలాగే పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు మంచినీరు, చంటి పిల్లలకు పాలు, పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారీ పర్యవేక్షణలో సీఐ రవికుమార్, ఎస్సై వెలుగుల సురేష్ ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. సుమారు 20 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలియచేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

- మరొకరికి గాయాలు

కడియం, జూలై 28: కడియం మండలం కడియపుసావరం గ్రామంలో విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందగా మరొకరికి గాయాలయ్యాయి. పోలీసులు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దిడ్ల రమేష్ (38) సౌండ్‌సిస్టం నిర్వహిస్తుంటాడు. శనివారం సాయంత్రం స్థానిక ఆలయంవద్ద జరిగే కార్యక్రమానికి సౌండ్‌సిస్టం ఏర్పాటు చేశారు. కార్యక్రమం అనంతరం సౌండ్‌సిస్టం విప్పుతుండగా అతని వద్ద పనిచేస్తున్న ఎం.రాజు వైరును చేతికి చుట్టుకుంటూ వస్తుండగా సౌండ్‌గొట్టాల వైరు చివరిబాగం కరెంటు పోల్ విద్యుత్‌వైరుకు తగిలింది. దీంతో రాజు షాక్‌కు గురయ్యాడు. ఇది గమనించిన రమేష్.. రాజును విడిపించే ప్రయత్నం చేయగా అతడు కూడా విద్యుత్‌షాకుకు గురయ్యాడు. ఈ ఘటనలో రమేష్ తీవ్రంగాను, రాజు స్వల్పంగాను గాయపడ్డారు. రాజును కడియం సీహెచ్‌సీకి, రమేష్‌ను రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా రమేష్ మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారని పోలీసులు తెలిపారు. రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ టి.కృష్ణసాయి తెలిపారు.

అంగన్‌వాడీ ఆయా
ఆత్మహత్యాయత్నం

నల్లజర్ల, జూలై 28: మండలంలోని అచ్చన్నపాలెం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ ఆయా ఉన్నమట్ల కళ్యాణి కూటమి నాయకుల వేధింపులతో ఆత్మహత్యాయత్నం చేసినట్టు భర్త ఆంజనేయులు తెలిపారు. కూటమి నాయకుల ఒత్తిడితో ఐసీడీఎస్ అధికారులు బలవంతంగా తన భార్యకు శనివారం మెమో జారీ చేశారని, దీనితో మనస్తాపం చెందిన తన భార్య.. తాను ఇంటి వద్ద లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో ఉండగా నల్లజర్ల పీహెచ్‌సీకి తీసుకెళ్లగా మెరుగైన వైద్య నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఆంజనేయులు చెప్పారు.

● వరద ప్రాంతాల్లో నాయకుల పర్యటన
● ఇంకా వరద ముంపులోనే వాణిజ్య పంటలు
● వరద బాధితులకు ప్రభుత్వ సాయం అందజేత

యువ కాపునాడు జాతీయ ప్రచార కార్యదర్శిగా పండుబాబు

అమలాపురం టౌన్, జూలై 28: యువ కాపునాడు జాతీయ ప్రచార కార్యదర్శిగా గారపాటి నాగేశ్వరరావు (పండుబాబును) నియమించినట్టు ఇన్‌చార్జి నిమ్మకాయల సురేష్ తెలిపారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా చిత్తూరు జిల్లాకు చెందిన పి.మల్లికార్జున, జిల్లా అధ్యక్షునిగా అరిగెల తేజవెంకటేష్‌లను నియమించినట్టు తెలిపారు. యువకాపునాడు జాతీయ అధ్యక్షుడు తాడివాక రమేష్‌నాయుడు ఆదేశాలతో ఈనియామకాలు జరిపామన్నారు.

జలదిగ్బంధంలోనే లంక గ్రామాలు






మామిడికుదురు:అప్పనపల్లి ఉచ్చులవారిపేటలో ఇంటిచుట్టూ చేరిన వరదనీరు, రావులపాలెం: రెండు బ్రిడ్జిల మధ్య వరద ఉధృతి, అంతర్వేది: టేకిశెట్టిపాలెం వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, అల్లవరం: బోడసకుర్రు వైనతేయ వరదలో పడవపై వెళ్లి బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

మామిడికుదురు, జూలై 28: గోదావరికి వరద తీవ్రత క్రమేణా పెరుగుతుండడంతో లంక గ్రామాలు జలదిగ్బంధం అవుతున్నాయి. లంక గ్రామాల్లోని ఇళ్ల చుట్టూ వరద నీరు చేరుతుండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పనపల్లి, పెదపట్నం, పాశర్లపూడి, దొడ్డవరం తదితర గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు, పలుకాలనీలు జల దిగ్బంధమయ్యాయి. పెదపట్నంలోని రత్నాపురం, అరుంధతిపేటలను వరద ముంచెత్తడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరు అందించే కుళాయిలు వరద నీట మునగడంతో ఇబ్బందుల మధ్య తాగునీటిని బిందెల్లోకి పట్టుకుంటున్నారు. పాశర్లపూడిలోని పళ్లవపాలెం, శ్రీరాంపేట తదితర ప్రాంతాల్లో వరదనీరు ఇళ్ల చుట్టూ ముంచెత్తుతుంది. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాశర్లపూడి బాడవలోని లక్ష్మీనవ్య కొబ్బరి ఈనెల పరిశ్రమల చుట్టూ వరద నీరు చేరడంతో అపార నష్టం వాటిల్లిందని ఆ యజమానికి లబోదిబో మంటున్నాడు. అప్పనపల్లి కాజ్‌వే జలదిగ్బంధంలో ఉండడంతో రాకపోకలు నిలిపివేశారు. మామిడికుదురు నుంచి ఉచ్చులవారిపేట మీదుగా అప్పనపల్లి వెళ్లే రోడ్డుపై రెండు అడుగుల నీరు చేరడంతో ఇబ్బందుల మధ్యలంక గ్రామాల ప్రజలు ప్రయాణాలు చేస్తున్నారు. అప్పనపల్లి, ఉచ్చులవారిపేట, ఇందిరమ్మకాలనీ, మొల్లేటివారిపాలెం, గెడ్డంవారిపేట తదితర కాలనీలు వరద నీటిలో చిక్కుకున్నాయి. ఆయా కాలనీల ప్రజలు భయం గుప్పిట్లోకాలం వెళ్లదీస్తున్నారు. భద్రాచలంలో తగ్గుముఖం పట్టినప్పటికీ ధవళేశ్వరం వద్ద వరద తీవ్రత పెరుగుతుండడంతో రెండు రోజులు ఇదే ఒరవడి కొనసాగుతుందని లంక గ్రామాల ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

వరద బాధితులకు సహాయం అందించండి

అంతర్వేది, జూలై 28: అప్పనరామునిలంక, టేకిశెట్టిపాలెం ప్రాంతాల్లో వరద ఉధృతిపై ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఆర్డీవో కేశవర్ధనరెడ్డి ఆదివారం అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ వరద బాధితునికి ఆహారం, తాగునీరు, నిత్యావసర సరుకులు, బియ్యం, కాయగూరలు సకాలంలో అందించేలా చూడాలన్నారు. బాధితుల ఇళ్ల వద్దకు ఎప్పటికప్పుడు వెళ్లి వారికి కావాల్సిన సదుపాయాలు కల్పించాలన్నారు. అనంతరం ఆర్డీవో కేశవర్ధనరెడ్డితో కలిసి టేకిశెట్టిపాలెం వద్ద ఏర్పాటుచేసిన ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది సందర్శించారు. రేషన్ షాపు వద్ద సరుకులు తీసుకుని సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ సిబ్బంది వరద బాధితుల ఇళ్లకు వెళ్లి అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో గుండుబోగుల పెదకాపు, ఏడీ హర్షవర్ధన్, ఎంపీడీవో సత్యనారాయణ, తహసీల్దార్ పెద్దిరాజు, డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్, కార్యదర్శి గంగరాజు, మండల సర్వేయర్ భద్రరాజు, వీఆర్వో దుర్గ, సచివాలయ ఉద్యోగులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

వాణిజ్య పంటలు నీట మునక

ఆలమూరు, జూలై 28: గోదావరి వరద ఉధృతి పెరుగుతుండడంతో మండలంలోని బడుగువానిలంక, మడికి, చొప్పెల్ల, చెముడులంక, మూలస్థానం, జొన్నాడ, ఆలమూరు లంక భూము ల్లోని వేలాది ఎకరాల్లో వాణిజ్య పంటలు నీట మునిగాయి. జొన్నాడ వద్ద పుష్కర ఘాట్ మునిగిపోగా ఆలయాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. రెండు బ్రిడ్జిల మధ్య గోదావరి పరవళ్లు తొక్కుతోంది.

వరద బాధితులను ఆదుకుంటాం

అల్లవరం, జూలై28: వైనతేయవరద బాధితుల్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. ఆదివారం ఆయన పడవపై బోడసకుర్రు పల్లిపాలెం వెళ్లి పరిస్థితులను పరిశీలించారు. పునరావాసం వద్ద ఒక్కో కుటుంబానికీ 25కిలోల బియ్యం, నూనె, ఉల్లిపాయలు అందజేశారు. గోపాయిలంక అవుట్‌ఫాల్ స్లూయిస్ పరిస్థితిపై ఎమ్మెల్యే ఆనందరావు ఆధ్వర్యంలో సోమవారం సమీక్ష జరుగుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు విలేకరులకు తెలిపారు. తహసీల్దారు పి.సునీల్‌కుమార్, ఎంపీడీవో కృష్ణమోహన్,సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, అడపా శ్రీనివాసరావు, చింతా శ్రీనివాస్, ఓలేటి పరమేశ్వరరావు, ఐలా నాగేశ్వరరావు, రేళ్ల శ్రీని వాస్, చింతా బాబ్జీ, గణపతిరావు, ముత్యాల బాబి, రొక్కాల నాగేశ్వరరావు, ఎస్.దుర్గాశ్రీనివాస్, కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

పిచ్చుకలంకను ముంచెత్తిన వరద

ఆత్రేయపురం, జూలై28: గోదావరివరద ఉధృతమ వుతోంది. కాటన్‌బ్యారేజీ నుంచి 15.90లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. పిచ్చుకలంకలో నివాసముంటున్న వారి ఇళ్లల్లోకి నీరు చేరుకుంది. 20కుటుంబాల వారు సామగ్రితో ఒడ్డుకు వచ్చి గుడారాలు ఏర్పాటుచేసుకున్నారు. తహసీల్దారు వెంకట్రామయ్య అక్కడికి చేరుకుని వరద ఉధృతిని, ముంపు ప్రాంతాన్ని పరిశీలించారు. తాత్కాలిక షెడ్లవద్ద నిర్వాసుతులతో మాట్లాడారు. వ్యాధులు ప్రబలకుండా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపడుతున్నారు. వాడపల్లిలంకలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. లంకగ్రామాల్లో పంటలు పూర్తిగా కొట్టుకుపోయాయి. వరద పెరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

తోకలంకను చుట్టిన వరద

రావులపాలెం, జూలై28: మండలంలోని గౌతమి, వశిష్ఠ పాయలకు వరద నీరు పోటెత్తింది. దీంతో లంక పొలాలన్నీ ముంపులో చిక్కుకున్నాయి. ఊబలంక శివారు తోకలంకను వరద నీరు చుట్టుముట్టింది. రెవెన్యూ అధికారులు పడవపై అక్కడికి వెళ్లి ఆ ప్రాంత వాసులను అప్రమత్తం చేశారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నట్టు చెప్పారు.

కొనసాగుతున్న వరద ఉధృతి

కపిలేశ్వరపురం, జూలై 28: మండలంలోని నదీ పరివాహక ప్రాంతాలైన కేదార్లంక, వీధివారిలంక, నారాయణలంక, పల్లపులంక, అద్దంకివారిలంక, తాతపూడి, కపిలేశ్వరపురం, కోరుమిల్లిలో లో గోదావరి వరద ఉధృతి కొనసాగుతుంది. ఇప్పటికే లంకగ్రామాల్లోని ఉద్యానపంటల నీటమునిగి దెబ్బతిన్నాయి. కూరగాయ పంటలు పనికిరాకుండా పోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. వరద ఉధృతి నేపథ్యంలో లంకగ్రామాల్లో 5 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు మండలస్థాయి అధికారులను, సిబ్బందిని నియమించామని, వరదల పట్ల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నట్టు తహసీల్దార్ రాజరాజేశ్వరి తెలిపారు. నారాయణలంకలో పర్యటించిన ఆమె వరద పరిస్థితిని సమీక్షించారు. నారాయణలంక బ్రిడ్జిపైకి నీరు చేరుతుందని తెలిపారు. గ్రామాల్లో మెడికల్ క్యాంపులు కొనసాగుతుండగా పారిశుధ్యంపై లంకగ్రామాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టారు. తహసీల్దార్‌వెంట వీఆర్వోలు వెంకటేశ్వరరావు, ప్రసాద్, పంచాయతీ రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ముంపు బాధితులు ఆందోళన చెందవద్దు

కొత్తపేట, జూలై 28: గోదావరి వరద ముంపునకు గురైన బాధితులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తహసీల్దారు జి.ఏలిషా పేర్కొన్నారు. కొత్తపేట శివారు నారాయణలంక వరద ముంపు ప్రాంతాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ముంపునకు గురైన గృహాలను గుర్తించి బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండి బాధితులకు సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్ఐ కె.ఏడుకొండలు, వీఆర్వో సత్యనారాయణ పాల్గొన్నారు.

లంక గ్రామాలను చుట్టుముట్టిన వరద

అయినవిల్లి, జూలై 28: ఎగువప్రాంతాల్లో వరద తగ్గుముఖం పట్టినప్పటికీ ధవళేశ్వరం వద్ద వరద ఉధృతి కొనసాగుతుండడంతో నదీపాయల్లో వరద పోటెత్తి గ్రామాలను చుట్టుముట్టింది. లంకగ్రామాలన్నీ జలదిగ్బంధంలో ఉన్నాయి. రహదారులపై వరద ప్రవహిస్తుంది. వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక, చింతనలంక, పెదలంక, కొండుకుదురు లంక, పొట్టిలంక, యలకల్లంక గ్రామాలను వరదచుట్టుముట్టింది. పశుగ్రాసాల కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పశుగ్రాసం పంపిణీ చేయాలని కోరుతున్నారు.

గాలిదేవుడు కుటుంబాన్ని ఆదుకోవాలి

ముమ్మిడివరం, జూలై 28: అల్లరిమూకల దాడిలో చేట్ల గాలి దేవుడు మృతిచెందగా ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, రూ.20లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సీపీఐ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ముమ్మిడివరంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యుడు జి.దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సీపీఎం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కృష్ణపై పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలి

ముమ్మిడివరం, జూలై 28: హిందూ మత సంస్కృత గ్రంథాల్లోని గుట్టును తెలుగులో రట్టు చేసిన బహుజన మేధావి, డాక్టర్ కదిరే కృష్ణపై మనువాదులు పెట్టిన కేసులు తక్షణం ఉపసంహరించుకోవాలని ప్రజా సంఘాలు డిమాండు చేశాయి. స్థానిక బుద్ధపార్కు ఆవరణలో ప్రజాసంఘాలు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రముఖ న్యాయవాది వడ్డి నాగేశ్వరరావు, దోనిపాటి ఆంజనేయులు తదితరులు మాట్లాడారు. కదిరే కృష్ణకు ప్రభుత్వమే భద్రత కల్పించాలన్నారు. సమావేశంలో జనిపల్లి సత్యనారాయణ, కాశి సింహాద్రివర్మ, సబ్బతి సత్యనారాయణ, కాశి అప్పారావు, పులుపు రవిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

భారత్‌కు 4వ స్థానం గర్వకారణం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 28: అంతర్జాతీయ 65వ గణిత ఒలింపియాడ్‌లో భారత్ 4వ స్థానం పొందడం భారతీయులకు గర్వకారణమని రామానుజన్ గణిత అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా.కె.వి.వి.సత్యనారాయణ అన్నారు. అమెరికా, చైనా, రొమేనియాలు మొదటి మూడుస్థానాలు పొందాయని ఇండియా నాల్గవ స్థానం దక్కించుకుందన్నారు. జూలై 11 నుంచి 22వరకు ఇంగ్లాండులో బాత్‌యూనివర్శిటీలో 690మంది విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించారని తెలిపారు. భారత్ నుంచి ఆరుగురు విద్యార్థులు పాల్గొని 252పాయింట్లకు 167పాయింట్లు సాధించారన్నారు. వీరిలో నలుగురు బంగారు పతకాలు, ఒకరు సిల్వర్ మెడల్ పొందారన్నారు. భారతీయ విద్యార్థులను తీర్చిదిద్దిన లీడర్ కృష్ణన్ శివ సుబ్రహ్మణ్యన్, డిప్యూటీ లీడర్ రైజుల్ శైనీలను డా.కె.వి.వి.సత్యనారాయణ అభినందించారు.

కోటలో జ్వరాలు

కె.గంగవరం, జూలై28: కోటగ్రామంలో జ్వరాలు విజృంభించాయి. మూడు రోజులుగా ఒక్కొక్కరిగా జ్వరాల బారిన పడుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దంగేరు వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జ్వరాలపై సర్వే చేశారు. ఒకరికి డెంగ్యూ జ్వరం ఉందని గుర్తించి ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు హెల్త్ సూపర్‌వైజర్ జి.శ్రీమన్నారాయణ చెప్పారు. గ్రామంలో త్రాగునీటి క్లోరినేషన్ చేయించామని, పారిశుధ్యంపై శ్రద్ధ తీసుకోవాలని పంచాయతీ సిబ్బందికి సూచించినట్లు వైద్యాధికారి ఆమని చెప్పారు.

వంద కౌంటుకు రూ.250 రేటు ఉండాలి

మలికిపురం, జూలై28: ఆక్వా రంగం నిలదొక్కుకోవడానికి ప్రభుత్వం వంద కౌంటుకు రూ.250 కచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆక్వా రైతులు కోరుతున్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఆక్వారంగ మేతలపై జీఎస్టీ తగ్గించడంతో మేత రేట్లు తగ్గుతాయని అంటున్నారని, ఆక్వా రైతు నిలబడేందుకు వంద కౌంటును రూ.250కు కొనేలా ప్రభుత్వం ఫిక్సడ్ రేటు ఏర్పాటుచేస్తే ఆక్వారైతుల సమస్యలు గట్టెక్కుతాయని రైతులు అంటున్నారు.

బెటర్ లైఫ్ సర్వీస్ ఆర్గనైజేషన్ సేవలు

మామిడికుదురు, జూలై 28: నగరం గ్రామానికి చెందిన కడిమి మహేష్ పెయింటింగ్ పనిచేస్తూ రెండు అంతస్తుల పైనుంచి పడడంతో అతడి వెన్నుపూస విరిగింది. శంకరగుప్తానికి చెందిన బెటర్ లైఫ్ సర్వీస్ ఆర్గనైజేషన్ రూ.10వేలు సమకూర్చగా ఆదివారం బాధితునికి నగదును జాలెం సుబ్బారావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మొల్లేటి శ్రీనివాస్, కోళ్ల సురేష్‌బాబు, కిష్వర్‌రాజ్, ఆర్గనైజేషన్ సభ్యులు పాల్గొన్నారు.

శస్త్ర చికిత్సకు ఆర్థిక సాయం

అమలాపురం టౌన్, జూలై 28: డాబా పైనుంచి పడి తలకు తీవ్ర గాయమై అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంటున్న ఐదేళ్ల బాలుడు లాస్విక్‌కు సర్పంచ్‌లు ఆదివారం రూ.8వేలు ఆర్థిక సాయం అందించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పెనుమాల సునీత, గంగుమళ్ల ఏసుబాబు, చెల్లుబోయిన నాని, కరాటం రత్నప్రసన్న-ప్రవీణ్, గోకరకొండ వాసు పాల్గొన్నారు.

గాజులమ్మవారిగా సత్తెమ్మతల్లి




సత్తెమ్మ తల్లి, అశిరాంబ

ముమ్మిడివరం, జూలై 28: సీహెచ్ గున్నేపల్లిలోని సత్తెమ్మతల్లి అమ్మవారు ఆదివారం గాజులమ్మవారిగా దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం చివరి ఆదివారం కావడంతో సత్తెమ్మతల్లి అమ్మవారిని సుంకర శ్రీనివాస్ సమకూర్చిన రంగురంగుల గాజులతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గాలిదేవర రాధాకృష్ణ బూరెలు, తోట వెంకటేశ్వరరావు పులిహోర, ఆకుల ఈశ్వరరావు, నిమ్మకాయల వెంకటదుర్గామహేష్ చక్కెరపొంగలి అమ్మవారిని నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన చిన్నపిల్లలకు పడాల వాసు ఉచితంగా పాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక భజనా కార్యక్రమం నిర్వహించారు.

శాకంబరిగా ఉరదాలమ్మ

ఆలమూరు, జూలై 28: గుమ్మిలేరు గ్రామదేవత ఉరదాలమ్మ అమ్మవారు ఆదివారం శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆలయ భక్త మండలి, హరే శ్రీనివాసా భజన మండలి సమకూర్చిన 120 కిలోల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. భక్తులు పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అశిరాంబ అమ్మవారి జాతర

కపిలేశ్వరపురం, జూలై 28: అంగరలో కొలువైయున్న శ్రీఅశిరాంబ అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం జరిగింది. డప్పువాయిద్యాలు, డోలుసన్నాయి మేళాలతో బాణసంచా నడుమ అమ్మవారి జాతరను వైభవంగా నిర్వహించారు. జాతరలో గరగనృత్యాలు, కేరళ వాయిద్యాలు, శక్తి, ఎలుగుబంట్లు, గొర్రగేదెలు, తదితర విచిత్ర వేషాలతో జాతర జరిగింది. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు చీర, రవిక, గాజులు, నైవేద్యాలు సమర్పించి అమ్మవార్కి మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం ఆలయం వద్ద తీర్థం, మంగళవారం అమ్మవారి నైవేద్యాలతో జాతర మహోత్సవం ముగియనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అంగర, పడమర ఖండ్రిక, గ్రామస్తులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

సిద్ధివినాయక ఆలయంలో హైకోర్టు జడ్జి పూజలు



అయినవిల్లి: జడ్జి రవినాథ్ తిల్హారీకి స్వాగతం పలుకుతున్న అర్చకులు

అయినవిల్లి, జూలై 28: అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయంలో హైకోర్టు జడ్జి రవినాథ్ తిల్హారీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం సిద్ధివినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. తొలుత ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు వేదాశీర్వచనం చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలోని క్షేత్ర పాలకుడైన కాలభైరవ స్వామిని, కేశవస్వామి, వీరేశ్వరస్వామి, అన్నపూర్ణాదేవి ఆలయాలను ఆయన దర్శించుకున్నారు.

నరసింహస్వామి ఆలయంలో పూజలు

అంతర్వేది, జూలై 28: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఏపీ హైకోర్టు జస్టిస్ రవీంద్రనాథ్ తిల్హరీ కుటుంబ సమేతంగా విచ్చేశారు. వారికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ, స్వామివారి అంతరాలయంలో దర్శనం అనంతరం వేద పండితులుమహదాశీర్వచనం అందించారు. తిల్హరీ దంపతులకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

వెంకన్న ఆలయంలో పూజలు

ఆత్రేయపురం, జూలై 28: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరీ, సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ ఎలక్ట్రికల్ డిస్ట్రిబ్యూషన్ ఇంజనీర్ తేరయ్య కేడ్ కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకున్నారు. వారికి అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. వేదపండితుల ఆశీర్వచనం అనంతరం ఉప కమిషనరు భూపతిరాజు కిషోర్‌కుమార్ స్వామివారి చిత్రపటాలు అందజేశారు.

ములగాలమ్మ తీర్థ మహోత్సవం

అమలాపురం రూరల్, జూలై 28: గున్నేపల్లి అగ్రహారం గ్రామ దేవత ములగాలమ్మ అమ్మవారిని ఆదివారం వందలాది మంది భక్తులు దర్శించుకున్నారు. తీర్థం నిర్వహించి గ్రామ దేవతకు విశేష అలంకారం జరిపారు.

జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్‌లో అప్పన్నకు కాంస్య పతకం



అప్పన్నను సత్కరిస్తున్న క్రీడాకారులు

అమలాపురం టౌన్, జూలై 28: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగిన మాస్టర్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ జాతీయ స్థాయి పోటీల్లో అమలాపురం హెల్త్-ఫిట్‌నెస్ జిమ్ క్రీడాకారుడు బి.అప్పన్న కాంస్య పతకం సాధించాడు. పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కోనసీమ జిల్లా శాఖ అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు అధ్యక్షతన ఆదివారం అభినందన సభ నిర్వహించారు. యువత అప్పన్నను ఆదర్శంగా తీసుకోవాలని గౌరవాధ్యక్షుడు నగభేరి కృష్ణమూర్తి కోరారు. పలువురు అప్పన్నను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కోచ్ మట్టపర్తి సముద్రం, కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు, ముత్తాబత్తుల వెంకటరమణ, కంచిపల్లి శ్రీను, గంగుమళ్ల దొరబాబు, పూటి వెంకట్రావు, మల్లుల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణ సీతమ్మ పేరు పెట్టడం శుభపరిణామం

అమలాపురం రూరల్, జూలై 28: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్నబోజన పథకానికి అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ పేరు పెట్టడం శుభపరిణామమని కోనసీమ బ్రాహ్మణ సంఘ నాయకుడు టీకే విశ్వనాథ్ పేర్కొన్నారు. సీతమ్మ జీవిత చరిత్రను తెలుగు పాఠ్యాంశాల్లో చేర్చాలని కోరారు. డొక్కా సీతమ్మ ఖ్యాతిని పెంచే విధంగా కృషి చేసిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఉపసర్పంచ్ పదవికి నోటిఫికేషన్ విడుదల కాలేదు

రాయవరం, జూలై 28: రాయవరం గ్రామ పంచాయతీలో ఖాళీగా ఉన్న ఉపసర్పంచ్ ఎన్నికకు సంబంధించి ఎన్నికల కమిషన్ నుంచి ఎటువంటి నోటిఫికేషన్ విడుదల చేయలేదని పంచాయతీ కార్యదర్శి పి.వెంకటరత్నం ఆదివారం తెలిపారు. రాయవరం ఉపసర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరణ చేస్తున్నట్టు వైసీపీకి చెందిన నేత కుటుంబ సభ్యులు రాయవరంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీ వాట్సాప్‌లో పోస్టులు రావడంతో కార్యదర్శి స్పందించారు. ఉపసర్పంచ్ పదవికి నోటిఫికేషన్ రాలేదన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: ఆపరేషన్ రావణ
శ్రీలలిత	: పురుషోత్తముడు
శేఖర్ స్ర్కీన్-1	: డార్లింగ్
శేఖర్ స్ర్కీన్-2	: డెడ్ పూల్
రమా	: రాయన్
గణపతి	: హరోం హర
వెంకటపద్మావతిస్ర్కీన్-1:	కల్కి
వెంకటపద్మావతి స్ర్కీన్-2:	డెడ్ పూల్

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.3.75 లక్షలు

ఆత్రేయపురం, జూలై 28:వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,75,236 లభించినట్టు ఉపకమిషనరు భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి భీమవరానికి చెందిన తట్టవర్తి వెంకన్న-వెంకటనాగశాంతిశోభ దంపతులు రూ.60,696, ద్వారపూడికి చెందిన ఐనవల్లి వెంకట సత్యనారాయణ-వీరనాగమణి దంపతులు రూ.25,200, పాలకొల్లుకు చెందిన ర్యాలంగి రాజేంద్రకుమార్ రూ.10వేలు విరాళాలు సమర్పించారు. దాతలకు స్వామివారి చిత్రపటాలు అందజేశారు.

సంక్షేమ పథకాలకు ఉత్తముల పేర్లు సరైన నిర్ణయం

కొత్తపేట, జూలై 28: ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సామాజిక సేవలు అందించిన ఉత్తముల పేర్లు పెడుతూ కూటమి ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుందని బీజేపీరాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం అన్నారు. ఆదివారం ఆయన ఈమేరకు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

తల్లిదండ్రుల త్యాగం వెలకట్టలేనిది



తల్లిదండ్రులకు పాదపూజ

రాయవరం, జూలై 28: ఆర్థిక పరిస్థితులు ఎలాఉన్నా తమ కష్టాలు తెలియకుండా పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి వారికి ఏకష్టం రాకుండా చూసుకునే తల్లిదండ్రుల త్యాగం వెలకట్టలేనిదని రమల పీఠం వ్యవస్థాపకుడు, వేదపండితుడు సాలిగ్రామ రమణశర్మ అన్నారు. ఆదివారం రాయవరం భాష్యం స్కూల్‌లో నిర్వహించిన పేరెంట్స్‌డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి వారి పట్ల విద్యార్థులు ఎల్లప్పుడూ కృతజ్ఞత భావంతో మెలగాలని, లక్ష్యం కలిగి చదవడం ద్వారా ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చన్నారు. విద్యార్థులతో తల్లిదండ్రులకు పాదపూజలు చేయించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, మొక్కలు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ పట్నాల శ్రీనివాసగుప్తా, ప్రైమరీ ప్రిన్సిపాల్ మద్దాడ కాంచన, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రాపాక పరామర్శ


అంతర్వేది, జూలై 28: టేకిశెట్టిపాలెం, అప్పనరామునిలంక వరద ప్రాంతాల్లో మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఆదివారం పర్యటించారు. పడవపై బాధితుల వద్దకు వెళ్లి ప్రభుత్వం సదుపాయాలు సక్రమంగా అందుతున్నాయా అని ఆరా తీశారు. నాయకులతో కలిసి ఓఎన్జీసీ కాలనీ, కొత్తలంక, లాకోపేట తదితర వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించారు.

బాధితులకు బియ్యం పంపిణీ

అంతర్వేది, జూలై 28: సఖినేటిపల్లిలంకలో సర్పంచ్ రేపూరి రాజేశ్వరి ఏసునరసింహరాజా, మూడు పార్టీల అధ్యక్షుల ఆధ్వర్యంలో వరద బాధితులకు బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేశారు. అప్పనరామునిలంకలో సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు, బీజేపీ జిల్లా ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్, మజా సర్పంచ్ బర్రే శ్రీను బాధితులకు ఆహార పొట్లాలు అందించారు.

ఏ క్షణమైనా కూలవచ్చు..!

అమలాపురం రూరల్, జూలై 28: కామనగరువు రోడ్డులోని పరంజ్యోతి పబ్లిక్ స్కూలు ఎదురుగా రెండు ప్రధాన రహదారులను కలుపుతూ నిర్మించిన వంతెన నేడు ప్రమాదకర స్థితికి చేరింది. ఇప్పటికే మధ్య భాగంలో దిగబడిపోయి ఇనుప చట్రాలు వేలాడుతున్నాయి. ఏ క్షణమైనా కూలిపోయేలా వున్నా కనీసం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయకపోవడం శోచనీయం.



వరద బాధితులను ఆదుకుంటాం



అప్పన్నపల్లిలో వరద బాధితులకు బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

మామిడికుదురు, జూలై 28: వరద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. పెదపట్నంలంక, బి.దొడ్డవరం, అప్పన్నపల్లి, పెద్దపట్నం గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. వరద బాధితులను పరామర్శించి వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వం అందించిన బియ్యాన్ని పంపిణీ చేశారు. బాధితులను అన్నివిధాలా ఆదుకునేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అధికారులను ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అడబాల తాతకాపు, సుందరినీడి చిన్ని, గెడ్డం మంగాలక్ష్మి, ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య, తహశీల్దారు ఎం.మేరీకమ్మ తదితరులు పాల్గొన్నారు.

మల్లిపూడి కుటుంబానికి వేగుళ్ల పరామర్శ

మండపేట, జూలై28: మండపేటకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, సహకార సంఘం మాజీ అధ్యక్షుడు మల్లిపూడి గణేష్ మాతృ వియోగంతో బాధపడుతున్నారు. ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆదివారం పరామర్శించారు. కపిలేశ్వరపురం మండలం కేదార్లంకలో సాదా ఈశ్వరరావు, తెలగాని సుబ్బయ్య, అన్నం యేసుబాబు ఇటీవల మృతిచెందగా ఆయా కుటుంబ సభ్యులను వేగుళ్ల ఆదివారం పరామర్శించారు. వేగుళ్ల వెంట స్థానిక టీడీపీ నేతలు సాదా రవిభాస్కర్, వీధి ప్రసాద్, రంకిరెడ్డి వేంకటేశ్వరరావు, మారిశెట్టి శ్రీనివాసరావు, చోడిపనీడి సతీష్, కాశి చిట్టిరాజు, యర్రంశెట్టి తాతాజీ, దూలం శ్రీను, సాదా దనరాజు, పల్లియోహన్ ఉన్నారు.

గాలింపు చర్యలు ముమ్మరం: ఎంపీ హరీష్

అమలాపురం, జూలై 28(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం మండలం ఉడిమూడిలంక వద్ద గోదావరి నదీపాయలో ఆదివారం జరిగిన పడవ ప్రమాదం సమాచారాన్ని తెలుసుకున్న అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ తక్షణం స్పందించారు. వెంటనే ఎస్పీ బి.కృష్ణారావుతో పాటు రెవెన్యూ అధికారులను సంప్రదించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గల్లంతైన చదలవాడ విజయ్‌కృష్ణ(25) కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఐదుగురిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన మత్స్యకారులకు అభినందనలు తెలిపారు. విజయ్‌కృష్ణ క్షేమం కోరుతూ ప్రార్థించారు. అతడి ఆచూకీ కోసం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని ఎంపీ హామీ ఇచ్చారు.

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించాలి

రాజోలు, జూలై 28: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించాలని ఎస్ఐ జి.పృథ్వి అన్నారు. ఇటీవల తైక్వాండోలో జిల్లాస్థాయిలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన తైక్వాండో క్రీడాకారులను రాజోలులోని అక్కిరాజు చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో అధ్యక్షుడు ముదునూరి లతేంద్రవర్మ ఆధ్వర్యంలో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బోళ్ల వెంకటరమణ, ఎస్ఐ పృథ్వి, అక్కిరాజు చారిటబుల్ ట్రస్టు ఆదివారం సత్కరించారు. తైక్వాండో కోచ్ మణికుమార్‌ను దుశ్శాలువాతోసత్కరించారు.

పథకాలు పేర్లు మార్పుపై హర్షం

మండపేట,జూలై28: వైసీపీ ప్రభుత్వం అమలుచేసిన పథకాలకు కూటమి ప్రభుత్వం పేర్లు మార్పు చేయడంపై బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోనా సత్యనారాయణ హర్షం వ్యక్తంచేశారు. విద్యాశాఖ పథకాలకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, డొక్కా సీతమ్మ, డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం పేర్లు పెట్టడం అభినందనీయమన్నారు. అన్నక్యాంటీన్లకు, మధ్యాహ్న భోజనపథకానికి మండపేటకు చెందిన డొక్కా సీతమ్మ పేరు పెట్టడం ప్రశం సనీయమన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ

అంబాజీపేట, జూలై 28: దోమల నివారణకు మాచవరం పంచాయతీ పరిధిలో ఎబెట్ మందును పిచికారీ చేస్తున్నామని ఈవోపీర్డీ మమత అన్నారు. పలు కాలనీల్లో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి సుబ్బారావు, కార్యదర్శి జీవీవీకే కుమార్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు.

ఎస్టీయూ సంక్షేమ నిధి కన్వీనర్‌గా బోనం



అంబాజీపేట, జూలై 28: ఎస్టీయూ సంక్షేమ నిధి కమిటీ కన్వీనర్‌గా అంబాజీపేటకు చెందిన ఎస్టీయూ నాయకుడు బోనం వెంకట గంగాధర్ నియమితులయ్యారు. ఎస్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, ఎం.రఘునాథ్‌రెడ్డి ఆదివారం ఉత్తర్వులు అందించారు. గంగాధర్‌ను జిల్లా అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు, జిల్లా కార్యదర్శి పల్లంరాజు, మండల శాఖ అధ్యక్షుడు కుంపట్ల సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి ఎండీఎస్ఎం షరీఫ్, పొట్టుపోతు శ్రీనివాసరావు, చోడిశెట్టి సతీష్, రాయుడు సత్యనాద్, గాదె శ్రీను, పినిపే సత్యనారాయణ, మట్టా ధనలక్ష్మి, పి.విశాలాక్షి అభినందించారు.

ఎస్టీయూ శిక్షణా తరగతుల కమిటీ కన్వీనర్‌గా నాగరాజు



మామిడికుదురు, జూలై 28: ఎస్టీయూ రాష్ట్ర ఉద్యమ శిక్షణా తరగతుల కమిటీ కన్వీనర్‌గా మామిడికుదురు గ్రామానికి చెందిన మట్టా నాగరాజు నియమితులయ్యారు. ఎస్టీయూ రాష్ట్ర కమిటీ నుంచి ఉత్తర్వులు వచ్చినట్టుగా మండల శాఖ అధ్యక్షుడు కారుపల్లి కల్యాణ్‌బాబు, ప్రధాన కార్యదర్శి కొమ్ముల వీరరాఘవరావు తెలిపారు. నాగరాజుకు ఎస్టీయూ నాయకులు, పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

మంత్రి కాన్వాయ్‌కి అడ్డుపడిన ఆకతాయిల అరెస్టు

కె.గంగవరం, జూలై 28: కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కాన్వాయ్‌కి అడ్డుపడి వీరంగం సృష్టించిన ఆకతాయిలను అరెస్టు చేసినట్లు పామర్రు ఎస్ఐ కె.జానీబాషా చెప్పారు. మంత్రి సుభాష్ శనివారం రాత్రి కోటిపల్లిలోని వరద ముంపు ప్రాంతాలను పరిశీలించి మసకపల్లి మీదుగా అమలాపురం బయలుదేరారు. ఈసమయంలో ఆటోలో వచ్చిన ఆరుగురు యువకులు కాన్వాయ్‌ను అడ్డగించి వీరంగం చేశారు. ఈసంఘటనపై కేసు నమోదు చేసి, వారిని అరెస్టు చేసినట్లు ఆయన వివరించారు.

వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

రాజోలు, జూలై 28: తాటిపాక మఠంలో వరద బాధితులకు ఎంపీపీ కేతా శ్రీను 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో కట్టా సూరిబాబు, వైదాని రాంబాబు, గుబ్బల ఉదయ్‌కృష్ణ, యాండ్ర శ్రీను, శీలం ఫణి, కె.సత్యనారాయణ, సారిక ఆంజనేయులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే అల్లూరు ప్రథమ వర్ధంతి

మలికిపురం, జూలై 28: రాజోలు మాజీ ఎమ్మెల్యే అల్లూరు కృష్ణంరాజు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం విశ్వేశ్వరాయపురం వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసి, అన్నదానం ఏర్పాటుచేశారు. ఆయన కుమారుడు శ్రీనివాసరాజు, కేవీ రామకృష్ణంరాజు, గోపాలరాజు తదితరులు పాల్గొన్నారు.